కూలీలకు పెరిగిన గిరాకీ !

- రోజు కూలి రూ.400 నుంచి రూ.500 చెల్లించాల్సిందే
- కూలీల రాకపోకలకు రవాణా చార్జీలు అదనం
- అయినా కూలీలు దొరకక రైతుల ఇబ్బందులు

కోడుమూరు రూరల్ : అన్నదాతకు అన్నింటా కష్టాలే. వర్షాభావ పరిస్థితుల మూలంగా నష్టాలు మూటగట్టుకుంటున్న రైతులకు అరకొర దిగుబడులను ఇళ్లకు తెచ్చుకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం రబీ సీజన్ సాగు పనులు జోరుగా సాగుతున్నాయి. అదేవిధంగా ఖరీఫ్ కింద సాగు చేసిన పత్తి తీతలు, ఉల్లి కోతలు ఊపందుకున్నాయి. దీంతో కూలీలకు భారీగా డిమాండ్ పెరిగిపోయింది. కోడుమూరు మండలంలో ఎక్కువ మంది రైతులు పత్తి, ఉల్లి పంటలను సాగు చేశారు. ప్రస్తుతం ఈ పంటలన్ని కోత దశలో ఉన్నాయి. దీంతో ఎప్పుడు లేని విధంగా మహిళా కూలీలకు ఏకంగా రూ.350ల నుంచి రూ.400 వరకు కూలి ఇవ్వాల్సి వస్తుంది. ఇక మగవారికి రూ.500 చెల్లించాల్సిందే. మండలంలో వర్షాధారంగా 2వేల ఎకరాలకుపైగా సాగు చేసిన ఉల్లి పంట చేతికి రావడంతో కోతలు మొదలు పెట్టారు రైతులు. నెల కిందటి రోజు కూలి మహిళలకు రూ.250 నుంచి రూ.300 ఇవ్వగా, ప్రస్తుతం రూ.400 వరకు పెరిగింది. పురుషులకు రూ.500 నుంచి రూ.600 వరకు డిమాండ్ మేరకు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. అదేవిధంగా రవాణా చార్జీలు అధనంగా చెల్లించాల్సిందే.

తీవ్ర ఇబ్బందులు పడుతున్న సామాన్య రైతులు

ఒక్కసారిగా పెరిగిన కూలి రేట్లతో సామాన్య రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతంత డబ్బులిచ్చి పొలాల్లో కూలీల చేత పనులు చేయించుకునేందుకు జంకే పరిస్థితులు నెలకొన్నయి. కూలీలు చెల్లించలేక కుటుంబ సభ్యులతో కలిసి పత్తి తెంపులు, ఉల్లి కోతలు చేసుకుంటున్నారు. మరికొందరు రైతులు పెరిగిన కూలీలతో పత్తి తెంపులను సైతం కొద్దికాలం వాయిదా వేసుకుంటున్నారు.

కూరగాయల రైతులకూ తప్పని కష్టాలు

కూలీలకు పెరిగిన డిమాండ్‌తో టమాటా, బెండ, చౌళకాయ తదితర కూరగాయల పంటలు సాగు చేసిన రైతులకూ కష్టాలు తప్పడం లేదు. కూరగాయల ధరలు మార్కెట్లో తక్కువగా ఉండడంతో పెరిగిన కూలి రేట్లకు కూరగాయలను తెంపిస్తే గిట్టుబాటు కావడం లేదని రైతులు వాపోతున్నారు. కూలీలకు రోజుకు రూ.400లు చెల్లించడంతో పాటు, కూలీల రవాణాచార్జీలు కూడా ఇవ్వాల్సి వస్తుండడంతో ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయని రైతులు వాపోతున్నారు.



ఉల్లిగడ్డలు కోస్తున్న కూలీలు



ఉల్లిగడ్డలను మార్కెట్‌కు తరలించేందుకు గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

వెంకటగిరికి భారీగా తరలివెళ్తున్న కూలీలు

మండలంలో అత్యధికంగా వెంకటగిరి గ్రామంలో 2వేలకు పైగా ఎకరాల్లో రైతులు వర్షాధారంగా ఉల్లి పంట సాగు చేశారు. ప్రస్తుతం ఉల్లి చేతికిరావడంతో కూలీలు దొరకని పరిస్థితి నెలకొంది. కూలి రేట్లు అధికంగా ఉండడంతో కోడుమూరు మండలంతో పాటు, చుట్టు పక్కల గోనెగొండ్ల, దేవనకొండ, వెల్దుర్తి, గూడూరు మండలాల నుంచి కూలీలు భారీగా తరలివెళ్తున్నారు. రైతులు రోజు కూలీ చెల్లించడంతో పాటు, రవాణా చార్జీలు కూడా చెల్లిస్తుండడంతో ఒక్క వెంకటగిరికే రోజుకు 1,000మందికిపైగా కూలీలు తరలివెళుతున్నారు.

పత్తితీతలకు చాలా ఇబ్బందిగా ఉంది

మండలంలో రైతులంతా ఒక్కసారిగా ఉల్లి కోతలు మొదలు పెట్టడంతో కూలీలకు డిమాండ్ భారీగా పెరిగిపోయింది. పత్తి తెంపేందుకు మహిళా కూలీలకు రోజుకు రూ.400 వరకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంత కూలీ ఏనాడు చూడలేదు. పెరిగిన కూలి రేట్లకు పత్తిని తెంపిస్తే ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదు. తెంపకుంటే చేతికొచ్చిన పత్తి వర్షాలకు తడిసిపోయే ప్రమాదముంది. తప్పక తెంపించుకోవాల్సి వస్తోంది.

– రైతు మిన్నెల్ల హుసేన్, ప్యాలకుర్తి

కూలీలకు భారీగా డిమాండ్ పెరిగింది

మూడున్నర ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశా. ప్రస్తుతం పంట చేతికొచ్చింది. ఉల్లి కోతలు మొదలు పెడదామంటూ ఉల్లి పీకేందుకు ఎకరాకు రూ.2500, ఉల్లి గడ్డలు కోసేందుకు రూ.8వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. మళ్లీ ఉల్లిగడ్డలను గ్రేడింగ్ చేసేందుకు మగవారికైతే రోజుకు రూ.500 చెల్లించాలి. వీటితో పాటు రవాణా చార్జీలు కూడా చెల్లించాల్సి వస్తోంది. పెరిగిన కూలీ రేట్లతో పెట్టుబడులు కూడా గిట్టుబాటుగాని పరిస్థితి నెలకొంది.

– గిడ్డయ్య, వెంకటగిరి

క్లుప్తంగా

పండ్ల తోటల సాగుతో అధిక లాభాలు



మామిడి మొక్కలను పరిశీలిస్తున్న ఏపీఓ మోదీన్‌బాషా

కోడుమూరు రూరల్ : పండ్ల తోటల సాగుతో రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చునని ఏపీఓ మోదీన్‌బాషాతో సూచించారు. శనివారం మండలంలోని గోరంట్ల, ఎర్రదొడ్డి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద సాగు చేసిన మామిడి, చీని పండ్ల తోటలను ఏపీఓ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పండ్ల తోటలను జాగ్రత్తగా కాపాడుకుంటే భవిష్యత్‌లో మంచి దిగుబడులు పొందవచ్చునన్నారు. పండ్ల తోటలు సాగు చేసుకున్న రైతులందరికీ మెయింటనెన్స్ నిధులు కూడా మంజూరయ్యాయని ఏపీఓ పేర్కొన్నారు.

కొత్తూరులో విద్యుత్‌శాఖ ఎస్‌ఈ పూజలు



సుధాకర్‌కుమార్‌కు జ్ఞాపికను అందిస్తున్న అర్చకులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉమ్మడి కర్నూల్ జిల్లా విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సుధాకర్‌కుమార్ కుటుంబ సమేతంగా పూజలు చేశారు.స్వామి వారికి అభి షేకాలు, అర్చనలు చేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని నాగలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివుడికి పూజలు చేశారు. పూజ ల అనంతరం ఎస్‌ఈ సుధాకర్‌కుమార్‌కు అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలతో జ్ఞాపికను అందజేశారు. ఆయన వెంట డీఈ సుబ్రహ్మణ్యం, ఏఈ ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ పోటీల్లో భాగంగా ఇటీవల నంద్యాలోని మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన కబడ్డీ పోటీలో కె. ప్రవీణ్‌కుమార్, యోగా పోటీలో లక్ష్మీనరసింహ, మనోజ్‌లు ప్రతిభ చాటారని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జిలానీ తెలిపారు. ఈ మేరకు శనివారం విద్యార్థులను హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ తిమ్మారెడ్డి

సి.బెళగల్: పోలీస్ అమర వీరుల వారోత్సవాలలో భాగంగా శనివారం పోలీసులు విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆయుధాలు ఉపయోగం, కేసుల నమోదు తీరును ఎస్‌ఐ తిమ్మారెడ్డి వివరించారు. ఈ సందర్భంగా కమ్యూనికేషన్ సెట్‌లో విద్యార్థులతో ఎస్‌ఐ మాట్లాడించారు. అదేవిధంగా ఫిర్యాదులు, రోడ్ల జారీ విధానంపై అవగాహన కల్పించారు. ఎంఎం పిస్టల్ వినియోగం, పనితీరును ఎస్‌ఐ వివరించారు.

మద్యం సేవించి వాహనాలు నడుపరాదు



మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి టెస్ట్ చేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

కోడుమూరు రూరల్ : మద్యం సేవించి వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నడపరాదని కోడుమూరు ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. శనివారం సాయంత్రం కోడుమూరులో ఎస్‌ఐ సిబ్బందితో కలిసి డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురిపై కేసులు నమోదు చేశారు. అలాగే ప్రధాన రహదారుల్లో రోడ్డుకు అడ్డంగా నిలిపిన వాహనాలకు కూడా ఎస్‌ఐ జరిమానా విధించారు. రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాలను ఉంచరాదని, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే విధంగా ఎవ్వరైనా వాహనాలు నిలిపితే జరిమానా విధిస్తామని ఎస్‌ఐ హెచ్చరించారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ జగదీష్‌చంద్రారెడ్డి

గడివేముల: ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ప్రజలకు అందుబాటులో ఉండాలని నంద్యాల జిల్లా ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ నోడల్ అధికారి డాక్టర్ జగదీష్‌చంద్రారెడ్డి సూచించారు. శనివారం మండల పరిధిలోని చిందుకూరు గ్రామంలో జరగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి మాట్లాడుతూ -0ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆయా గ్రామాల్లో ఓపీ నిర్వహించాలన్నారు. మధ్యాహ్నం నుంచి మంచానికే పరిమితమై రోగులను పరిశీలించి ఉచితంగా మందులను పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు పెంచడం సరికాదు

కర్నూలు(సెంట్రల్):చంద్రబాబునాయుడు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై భారాలు వేయడం సరికాదని సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా నాయకులు తిరుపాలు పేర్కొన్నారు. శనివారం ఆ సంఘం నాయకులు సీ క్యాంపులో నిరసన తెలిపారు. ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు పెంచబోనని హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు ప్రజలపై రూ. 6 వేలకోట్ల భారం వేశారన్నారు. వెంటనే పెంచిన చార్జీలను ఉపసంహరించుకోవాలన్నారు. యూనిట్‌కు రూ. 1.21 అదనంగా 15 నెలలపాటు వసూలు చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, విజయ్, గోపాల్, వెంకటేశ్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం

సి.బెళగల్: రెవెన్యూ సదస్సులతో రీ సర్వేలో భాగంగా నెలకొన్న భూ సమస్యలకు పరిష్కారం అవుతాయని కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ నాగ ప్రసన్న లక్ష్మి తెలిపారు. మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో శనివారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు డిప్యూటీ కలెక్టర్ హాజరై ప్రసంగించారు. రైతులు అందజేసిన అర్జీలకు 15 రోజుల్లో పరిష్కారం చూపుతామని చెప్పారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్వోలు, సర్వే సహాయకులు, వీఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ నాగ ప్రసన్న లక్ష్మి

కల్లూరు: మండల పరిధిలోని కె.మార్కాపురంలో శనివారం తహసీల్దార్ ఆంజనేయులు రీ సర్వే సమస్యలపై గ్రామ సభ నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దిలేటి, ఏపీ అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రామాంజనేయులు, మండల సర్వేయర్ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్ : రైతులంతా రెవెన్యూ సిబ్బందిని సంప్రదించి తమతమ భూసమస్యలను పరిష్కరించుకోవాలని గూడూరు తహసీల్దార్ రామాంజినేయులు సూచించారు. శనివారం గూడూరు మండలంలోని గుడిపాడులో తహసీల్దార్ రామాంజినేయులు రీసర్వేలో నెలకొన్న భూసమస్యలపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ లోకేశ్వరరెడ్డి, మండల సర్వేయర్ బాలునాయక్, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.



గుడిపాడు గ్రామసభలో రైతుల వినతులను పరిశీలిస్తున్న తహసీల్దార్ రామాంజినేయులు

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లులో శనివారం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి రీసర్వే సమస్యలపై గ్రామ సభ నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన తహసీల్దార్ పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీటీ శివశంకర్‌రెడ్డి, ఆర్‌ఐ రామ్, సర్పంచ్ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు వీరేషమ్మ

సి.బెళగల్: మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని వీరేషమ్మ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో పోటీలలో భాగంగా శనివారం విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి మాస్ సైక్లింగ్ పోటీలలో వీరేషమ్మ ఉత్తమ ప్రతిభ కనపచి రెండవ స్థానంలో నిలిచిందని వ్యాయామ ఉపాధ్యాయుడు సత్యకుమార్ తెలిపారు. త్వరలో జాతీయస్థాయిలో జరగనున్న మాస్ సైక్లింగ్ పోటీలలో ఆ విద్యార్థిని పాల్గొనడం జరుతుందన్నారు. వీరేషమ్మతోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు సత్యకుమార్‌ను హెచ్‌ఎం నిర్మళ వసంత కుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.



విజయవాడలో రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొన్న వీరేషమ్మ

రోడ్డు నిర్మించాలని వినతి

కల్లూరు: కల్లూచు చెన్నమ్మ సర్కిల్ నుంచి ముజఫర్ నగర్‌కు కొత్తగా రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ శనివారం డీవైఎఫ్‌ఐ నాయకులు ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మహేశ్వరరెడ్డికి వినతి పత్రం అందజేశారు. రోడ్డు అధ్వానంగా మారిందని, రాకపోకలకు ప్రజలతోపాటు వాహనచోదుకులు ఇబ్బందులు పడుతున్నారని ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ న్యూ సిటీ కార్యదర్శి హుస్సేన్ బాషా ఎస్‌ఈ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో నాయకులు వీరేష్, దివాకర్, ఆర్యన్, నందు తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మహేశ్వరరెడ్డికి వినతి పత్రమిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

అపార్‌ను పకడ్బందీగా నమోదు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ ఆదామ్ బాషా

సి.బెళగల్: ఉపాధ్యాయులు విద్యార్థుల ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదును పకడ్బందీగా చేపట్టాలని ఎంఈఓ ఆదామ్‌బాషా సూచించారు. శనివారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అపార్ నమోదుపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఉపాధ్యాయులకు నమోదు అంశాలను ఎంఈఓ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర సమాచారం నమోదు చేసి, ఒకే నంబర్‌పై దేశవ్యాప్తంగా సమాచారం ఉండేలా అపార్ ఉండనుందన్నారు. విద్యార్థుల వివరాలు తప్పుల్లేకుండా నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

పత్తాలేని సచివాలయ ఉద్యోగులు

సి.బెళగల్: గ్రామ సచివాలయ ఉద్యోగుల ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ, విధులుగా గైర్హాజరవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. శనివారం వారాంతం కావడంతో సి.బెళగల్ మండలంలోని గుండ్రేవుల గ్రామంలో ఉన్న ఇనగండ్ల గ్రామ సచివాలయంలో ఒక్క ఉద్యోగి కూడ అందుబాటులో లేరు. కేవలం సర్వే సహాయకులు ఆరోని మాత్రం విధులకు హాజరయ్యారు. మూమెంట్ రిజిష్టర్‌లో నమోదు చేసి కొత్తకోట రెవెన్యూ సదస్సుకు వెళ్లారు. దీంతో సచివాలయం ఖాళీ కుర్చీలతో దర్శణం ఇచ్చింది. విషయాన్ని ఎంపీడీఓ రాణెమ్మ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పదించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శితో పాటు మిగిలిన ఉద్యోగులు తమ అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరు అయ్యారని స్పష్టం చేశారు. వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కొంతమంది ఉద్యోగులు దాదాపు ఐదారు రోజుల పాటు ఎలాంటి అనుమతులు లేకుండా విధులకు డుమ్మా కొడుతున్నట్లు ఆ గ్రామ ప్రజలు అంటున్నారు.



ఇనగండ్ల సచివాలయంలో ఖాళీగా కుర్చీలు

ఇష్టారాజ్యం !

- అధికారబలం చూపుతున్న టీడీపీ నేత
- గ్రామ పంచాయతీ తీర్మాణం లేకుండానే 'నగరవనం' అభివృద్ధి పనులు చేపట్టిన తీరు
- నాలుగు రోజుల కిందట రూ.50 లక్షల సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన వైనం
- కర్నూలు మండలంలో పనులు... కల్లూరు మండల ఇంజినీర్ పర్యవేక్షణట

కర్నూలు (రూరల్) : టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నాలుగు నెలల్లోనే తమ్ముళ్ల తమ రాజకీయ బలాన్ని చాటుకుంటున్నారు. కర్నూలులో నివాసం ఉంటున్న కోడుమూరు నియోజకవర్గ టీడీపీ నేత అంతా తానై చక్రం తిప్పుతూ తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంటున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. గత ఎన్నికలల్లో తన అంగ, రాజకీయ బలంతో తనకు ఇష్టమైన వ్యక్తిని ఎమ్మెల్యేగా గెలుపించుకున్న ఆ నేత చెప్పిందే వేదంగా కొందరు అధికారులు సైతం తలూపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా కేంద్రం కర్నూలు సమీపాన ఉన్న 'నగరవనం' అభివృద్ధి పనులను 'చక్రం' తిప్పే ఆ నేతకు అనుకూలమైన కాంట్రాక్టర్‌కు అప్పగించడం ఇందుకు సాక్ష్యం. అయితే పంచాయతీ నిబంధనలు విరుద్ధంగా అధికారులు వ్యవహరించినతీరు పలు విమర్శలకు దారితీస్తుంది. 'నగరవనం' వాస్తవానికి నందనపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ఉంది. 'నగరవనం' అభివృద్ధి పనులకు నందనపల్లె గ్రామ పంచాయతీ తీర్మాణం తీసుకోవాల్సి ఉంది. అయితే చక్రం తిప్పిన నేత ఆదేశాల మేరకు అధికారులు పంచాయతీ నిబంధనలకు విరుద్ధంగా గార్గేయపురం పంచాయతీ తీర్మానం తీసుకుని ఏకంగా రూ.50 లక్షల ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో అభివృద్ధి పనులకు పచ్చజెండా ఊపారు. ఈ మేరకు లేక్ వ్యూ, బార్ పాయింట్ నుంచి స్లూయిజ్ గేటు వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు నాలుగు రోజుల క్రితం మొదలుపెట్టారు. భూమి పూజ కార్యక్రమాన్ని గుట్టుచప్పుడు కాకుండా జరిపారనే విమర్శలు లేకపోలేదు. ఏ ప్రజాప్రతినిధి పనుల ప్రారంభానికి హాజరవ్వని తీరు ఇందుకు సాక్ష్యం. ఒక్కమాటలో చెప్పాలంటే పనులు ప్రారంభమైన విషయం నందనపల్లె గ్రామ సర్పంచ్‌కు కూడా తెలియదట. మా గ్రామ పరిధిలో పనులకు మరొక గ్రామ పంచాయతీ తీర్మానం ఎందుకు అధికారులు తీసుకున్నారో మాకు అర్థం కావడం లేదంటున్నారు నందనపల్లె గ్రామ పెద్దలు సైతం. ఇక పనులు పర్యవేక్షణ విషయం ఇంకా విడ్డూరంగా ఉంది. కర్నూలు మండల పరిధిలో జరగుతున్న ఈ పనులకు కల్లూరు మండల ఇంజినీర్ పర్యవేక్షించడం కొసమెరుపు. తమకు అనుకూలమైన ఇంజినీర్ అయితే నాణ్యత పట్టించుకోడనే భావన ఉన్నట్లుంది చక్రం తిప్పే నేతకు. ఏదిఏమైనా టీడీపీ నేతలు అధికారబలం చూపుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



నగరవనం సమీపంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు



బోటింగ్ పాయింట్ చేరుకోవడానికి నిర్మిస్తున్న సీసీ రోడ్డు

అవగాహన లేనందునే గార్గేయపురం పేరు నమోదు



'నగరవనం' అభివృద్ధి పనుల విషయాన్ని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కర్రెన్న దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. అధికారులకు సరైన అవగాహన లేనందున గార్గేయపురం పేరును నమోదు చేశారన్నారు. అందువలన ఆ గ్రామ పంచాయతీ తీర్మానం తీసుకుని పనులు మొదలుపెట్టాల్సి వచ్చిందని చెప్పారు. అదేవిధంగా పర్యవేక్షణ ఇంజినీర్ గతంలో కర్నూలు మండలంలోనే ఎక్కువ కాలం పనిచేసిన అనుభవం మేరకు బాధ్యతలు అప్పగించామన్నారు. ఇంతకుమించి ఎవరి జోక్యం లేదని స్పష్టం చేశారు.

పెద్దాసుపత్రిలో వైద్యం వికటించి వ్యక్తి మృతి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్యం వికటించి ఓ వ్యక్తి మృతి చెందారు. తెలంగాణా రాష్ట్రం అలంపూర్ తాలూకా భీమవరం గ్రామానికి చెందిన లోకన్న(40) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుండేవారు. ఆయనకు వరిబీజం సమస్య ఉండటంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇటీవల చేరారు. జనరల్ సర్జరీ విభాగంలో వైద్యులు ఈ నెల 23వ తేదీన అతనికి వరిబీజం ఆపరేషన్ చేశారు. మరుసటిరోజు శుక్రవారం అతనికి ఫిట్స్ రావడంతో వార్డు నుంచి క్యాజువాలిటీకి తీసుకొచ్చారు. ఆయన ఆరోగ్యపరిస్థితి బాగాలేదని, ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాలని అక్కడే ఉన్న ఓ లేడీ డాక్టర్ చెప్పడంతో వారు నగరంలోని అమీలియో హాస్పిటల్‌కు రాత్రి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే లోకన్న మృతి చెందినట్లు కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యం వల్ల లోకన్న మృతి చెందాడని వారు ఆరోపించారు.

పింఛన్లు సక్రమంగా అందజేయాలి

కోడుమూరు రూరల్ : ఒకటో తారిఖునే ప్రభుత్వ మందజేసే పింఛన్లను గ్రామ సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు సక్రమంగా అందజేయాలని ఎంపీడీఓ ఆదేశించారు. శనివారం మండలంలోని గోరంట్ల గ్రామంలో ఎంపీడీఓ పర్యటించి గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కార్యాలయ వేళల్లో ఖచ్చితంగా సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజల సమస్యలు తెసుకుని పరిష్కరించేందుకు చొరువ చూపాలన్నారు. అనంతరం పీఆర్ ఏఈ గంగరాజుతో కలిసి గ్రామంలో చేపడుతున్న సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వలను నిర్మాణాలను ఎంపీడీఓ పరిశీలించారు.



ఉద్యోగులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ రాముడు

మల్లికార్జున వైన్ షాపును తరలించాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని మార్కెట్‌యార్డు సమీపంలో సుందరయ్య సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన మల్లికార్జున వైన్ షాపును వేరే ప్రాంతానికి తరలించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.నగేష్, రాఘవేంద్ర శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇక్కడ సమీపంలో ఆసుపత్రి ఉంది. అలాగే మెయిన్ రోడ్డు కావడంతో నిత్యం వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని చెప్పారు. ఈక్రమంలో ఇక్కడ వైన్ షాపును ఏర్పాటు చేయడంతో రోడ్లపైనే తాగుబోతులు గుంపులు గుంపులుగా ఉంటుండడంతో విద్యార్థినులకు తీవ్ర ఆటంకంగా ఉందన్నారు. ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తుతుందని అధికారులు స్పందించి షాపును వేరే చోటుకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని ఎక్సైజ్ అధికారులను కోరారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు

కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 3వేలు చొప్పున ఉపకార వేతనాలను శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం హుస్సేన్ సమక్షంలో విద్యార్థులకు ఉపకార వేతనం అందజేశారు. సమాజ సేవలో భాగంగా పేదల విద్యార్థులను తమవంతుగా ప్రోత్సహిస్తున్నామని శ్రీరామ్ ఫైనాన్స్ మేనేజర్ సంపత్ తెలిపారు.

భక్త కనకదాసు జయంతి అధికారికంగా నిర్వహించాలి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో భక్త కనకదాసు జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని జిల్లా కురువ సంఘం నేతలు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతి పత్రం పంపామన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో సంఘం అధ్యక్షులు పత్తికొండ శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి మాట్లాడుతూ అన్ని మండల కేంద్రాల్లో కూడా ఈ ఏడాది నుంచి ప్రభుత్వమే కనకదాసు జయంతిని నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. సమావేశంలో నాయకులు కొత్తపల్లి దేవేంద్ర, కోశాధికారి కేసీ నాగన్న, ధనుంజయ, బీసీ తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.